


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 28 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




# ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాలి







భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అగ్రికల్చర్ కోఆపరేటివ్ 7సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి కే సురేంద్రమోహన్ అన్నారు.శనివారం ఆయన సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది, లేనిది తెలుసుకోవడంతోపాటు, అలాగే వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు లబ్ధిదారులకు అందాలంటే అన్ని పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అప్పుడే లబ్ధిదారులకు సరైన విధంగా లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం తదితర రంగాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం, లబ్ధిదారుల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి అధికారులు చేయాల్సిన అవసరం ఉందన్నారు ఎక్కడైతే ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందుతుందో అక్కడ పేదరికం ఉండదని అన్నారు.సూర్యాపేట జిల్లాలో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ తో పాటు, అధికారులందరినీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితులలో లబ్ధిదారున్ని మర్చిపోకూడదని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో ప్రజలకు మేలు చేసేందుకు కృషి చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆయా శాఖల అధికారులు రొటీన్ పనుల పై కాకుండా అదే పనిని ఇతర ప్రాంతాలలో ఎలా చేస్తున్నారో అధ్యయనం చేసుకొని సాధ్యమైనంత ఎక్కువ లాభాన్ని ప్రజలకు చేకూర్చేందుకు కృషి చేయాలని, ఇందుకుగాను వినూత్నంగా ఆలోచన చేయాలని తెలిపారు. ఇందుకు సమర్థవంతమైన షెడ్యూల్ ను, ప్రణాళికను రూపొందించుకోవాలని, అప్పుడే ఆశాజనక ఫలితాలు వస్తాయని చెప్పారు . పథకాల అమలులో వివిధ శాఖలు సమ్మిళితంతో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్య , వైద్యం ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలులో జిల్లాలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ ప్రపంచంలో ఎక్కడ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన - ప్రణాళిక అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందని, నిధులు లేకున్నప్పటికీ జిల్లాలో సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించారని అన్నారు. అధికారులు ఆర్థిక విషయాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ పథకాలను అమలు చేయాలని , ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందో ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో వందకు వంద శాతం విజయవంతం అవ్వడం చాలా సంతోషంగా ఉందని, ఇదే విధంగా ముందు ముందు జిల్లాలో ఏ కార్యక్రమాన్ని పెట్టినా అందరూ సమిష్టిగా కలిసి విజయవంతం చేయుటకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతులకు వ్యవసాయ శాఖ యాప్ ల మీద అవగాహన కల్పించాలని, ప్రజలు అనారోగ్య బారిన పడకుండా రైతులు ఆర్గానిక్ పంటలు పండించే విధంగా వ్యవసాయ, హా ర్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించాలని, వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి రైతులు ఏ విత్తనాలు, ఏ ఎరువులు వాడితే లాభంగా ఉంటుందో అవగాహన కల్పించాలని, రైతు వేదికలలో రైతులకు సన్న వడ్ల సీడ్, ఫెర్టిలైజర్స్ అందించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ గా అదనపు కలెక్టర్ ఉంటారని, రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించాలని, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం, యూరియా యాప్, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18001237157 ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. అదే విధంగా సంక్షేమ హాస్టల్స్ లో సంక్షేమ అధికారులు వారానికి ఒక సారి సందర్శించి బడ్జెట్ మీద ఆధారపడకుండా మానవతా దృక్పథంతో ఫ్యాన్లు రిపేర్ చేయించడం, చెప్పులు లేని విద్యార్థులకు చెప్పులు కొనివ్వాలని సంక్షేమ అధికారులకు సూచించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా సూర్యాపేట జిల్లాలో 99 రోజులపాటు ఆయా అంశాల వారిగా చేపట్టిన కార్యక్రమాలను ప్రత్యేక అధికారికి వివరించారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను జిల్లా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక అధికారికి వివరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్న ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్ తో పాటు, జిల్లా ఎస్పీ కె నరసింహ ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం పై ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ప్రత్యేక అధికారి తిలకించి చాలా బాగా చేశారని అభినందించారు. చివరిగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిని సత్కరించి తమరు సూచించిన ఆదేశాలు జిల్లాలో తప్పకుండా అమలు చేస్తామని, ముందు ముందు ప్రభుత్వం ఏ కార్యక్రమాలు ప్రవేశపెట్టినా విజయవంతం చేయడం జరుగుతుందని, తమరి ఆదేశాలు తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జెడ్పి సీఈవో శిరీష, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డి ఆర్ డి ఏ సన్యాసయ్య , డి ఇ ఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.




## నీట్ పేపర్ లీక్‌తో యువత భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం



భానుపురి /సూర్యాపేట టౌన్

దేశ యువత భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ విమర్శించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రం వాణిజ్య భవన్ సెంటర్ లో నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి ఆదేశాలు, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య సూచనల మేరకు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకేజీలతో వారి భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు.దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, యువత ఆశయాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థను రాజకీయ, కార్పొరేట్ ప్రయోజనాలకు బలిచేయకుండా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రెబల్ శ్రీనివాస్, ఎస్.ఎస్. సాజిద్, నరేందర్ నాయుడు, చెంచాల నిఖిల్ నాయుడు, డి.ఆర్., వినయ్, సుదీర్, సైదులు, అబ్బాస్, నాగరాజు, కిరణ్, అశోక్, లక్ష్మణ్, శివ, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘ నాయకులపై అక్రమ కేసులు తగదు

భానుపురి /సూర్యాపేట టౌన్



విద్యార్థి సంఘ నాయకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను రాష్ట్ర ఓబీసీ నాయకులు బెంజారపు రమేష్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగాపాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వాటిపై కేసులు నమోదు చేయకుండా విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న విద్యార్థి సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యార్థులకు, విద్యార్థి సంఘాలకు తమ సమస్యలను వ్యక్తపరిచే హక్కు ఉందని, ఆ హక్కును అణచివేసే విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. విద్యార్థి సంఘ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర స్థాయి నాయకుల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## గౌరవ డాక్టరేట్ అందుకున్న రంగు ముత్యంరాజు

భానుపురి

సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆధ్యాత్మిక, సామాజిక సేవకులు, ఉద్యాన విస్తరణ అధికారి రంగు ముత్యంరాజు గురుస్వామి ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లో అందుకున్నారు. ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక అకాడమీ ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం యాజ మాన్యం ఆయనకు ఉద్యానవనం, దైవత్వం, ఆధ్యాత్మికత సామాజిక సేవ విభాగంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రైతు బిడ్డ నుంచి గురుస్వామి దాకా: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన రంగు సత్తయ్య గౌడ్, బుచ్చమ్మ దంపతులకు మొదటి సంతానంగా 1977 మే 9న ముత్యంరాజు జన్మించారు. చిన్నతనం నుంచే సేవాభావం అలవ ర్చుకున్న ఆయన, 1994లోనే నవోదయ యువజన సంఘాన్ని స్థాపించి మిత్రులతో కలిసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారత జాతీయ విద్యార్థి సంఘంలో కూడా క్రియాశీలకంగా పనిచేశారు. అయ్యప్ప తత్వ ప్రచారకుడు: గత 25 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి దీక్ష తీసుకుంటూ, గురుస్వామిగా వేలాది మంది భక్తులకు అయ్యప్ప తత్వాన్ని బోధిస్తున్నారు. దైవభక్తితో పాటు సేవాభావం పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభలో కీలకంగా వ్యవహరిస్తూ, దాతల సహకారంతో పేదలకు నిత్యాన్నదానం, అల్పాహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతు సేవకే అంకితం: రైతులకు సేవ చేయాలనే సంకల్పంతో తక్కువ వేతనమైనప్పటికీ, గత 16 సంవత్సరాలుగా ఉద్యాన శాఖలో ఉద్యాన విస్తరణ అధికారిగా పనిచేస్తూ రైతులకు విశేష సేవలు అందిస్తున్నారు. ఆధునిక పద్ధతులు, కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జర్నలిజంపై మక్కువ: సమాజ సేవతో పాటు జర్నలిజంపై ఉన్న మక్కువతో 1997 నుండి పత్రికా రంగంలో జర్నలిస్టుగా నిస్వార్థంగా పనిచేస్తున్నారు. సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. తనను గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసిన ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక అకాడమీ యాజమాన్యానికి ముత్యంరాజు గురుస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పలువురు ప్రముఖులు, అయ్యప్ప భక్తులు, రైతులు అభినందనలు తెలిపారు.



# కేసారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా





భానుపురి/ సూర్యాపేట రూరల్

సూర్యాపేట మండలంలోని కేసారం రైతు వేదికలో ఈ రోజు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం విత్తన మేళా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సంచాలకులు లిడాక్టర్ బి. గోపి ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగాడైరెక్టర్ సార్ మాట్లాడుతూ, వానాకాలం--2026 సీజన్‌లో వ్యవసాయ శాఖ ఏడు రకాల సన్న వరి రకాలను ప్రోత్సహిస్తోందని ఆ రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందజేస్తుందని తెలిపారు. అందువల్ల రైతులందరూ సన్న రకాల విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం మండల పరిధిలోని రైతు వేదికల్లో విత్తనాల పంపిణీ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా, ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను తీసుకోవాలని సూచించారు. అందరూ ఒకేసారి దుకాణాలకు రాకుండా క్రమపద్ధతిలో ఎరువులు పొందాలని, తద్వారా రద్దీ తగ్గడంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ యూరియా పక్కదారి పట్టకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా భూసారాన్ని కాపాడడంతో పాటు తక్కువ వ్యయంతో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మండలంలోని అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ ను కలిసిన మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణ రెడ్డి

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్



రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ సురేంద్రమోహన్ ను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.డి. ఫసియొద్దీన్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవల అందుబాటు, మౌలిక సదుపాయాల విస్తరణ, మార్కెట్ సేవల నాణ్యత పెంపు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రైతుల సంక్షేమం మరియు మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సమర్పించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని సురేంద్రమోహన్ తెలిపారు.

# విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

-స్పెషల్ మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ బక్కెర నాగలక్ష్మి



భానుపురి /కూసుమంచి

విద్యార్థిదశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ బక్కెర నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. శనివారం కూసుమంచి మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఖమ్మం లీగల్ సెల్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, పోక్సో, డ్రగ్స్, బాల్యవివాహాలు, ఇంకా అనేక చట్టాలగురించి వివరించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో నేడు జరుగుతున్న ప్రతి దాడులు వాటి వెనుక ఉన్న చట్టాలు మహిళలకు, పిల్లలకు, వయస్సుమళ్లినవారికి ఏవిధంగా న్యాయం చేకూర్చేవిధంగా చట్టం రూపొందించబడిందో వివరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎస్సై నాగరాజు, జిల్లా లీగల్ సెల్ న్యాయవాది దేవరకొండ కళ్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, సర్పంచ్ కొండ క్రిష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి పలువురు నాయకుల ఆశీర్వాదం







భానుపురి /సూర్యాపేట టౌన్

జిల్లా కేంద్రానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు గ్రహీత మదూరి బ్రహ్మచారి ఉమ దంపతుల( కూతురు అల్లుడు లోకేశ్వరి జవహర్ ల కుమారుడు) మనుమడు ఇషాన్ బారసాల కార్యక్రమం జిల్లా కేంద్రం జయ భాస్కర్ ఇన్ బాన్కెట్ హాల్లో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్, బిఆర్ఎస్ నేత మద్దికుంట్ల రఘు ( చింటూ), వారి వెంట మొరిశెట్టి లక్ష్మాది,ధరావత్ వీరన్న నాయక్, కరుణాకర్ రెడ్డి,అబ్దుల్ రహీం, సునీల్ రెడ్డి, నిఖిల్, అభినయ్, రవి, మాణిక్యం, బొలికొండ సైదులు,మహేష్ , శివ, నాగరాజు, వెంకన్న, కరీం, మహేష్, మల్లేష్, సాహెల్, విజయ్, శేఖర్, రియల్ ఎస్టేట్ నాయకులు వీరాచారి, చంద్రారెడ్డి, ఉపేందర్ రెడ్డి, భూపాల్, యాకూబ్ రెడ్డి, లింగాచారి,జర్నలిస్టులు సతీష్, శ్రవణ్, వెంకట్ , బంధువులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా కోటిలింగేశ్వర ఆలయంలో రాజశ్యామల యాగం







భానుపురి న్యూస్

శ్రీ కోటిలింగేశ్వర దేవస్థానము కానా యపల్లి నందు శనివారం శనేశ్వర సహిత రాజశ్యామల యాగం నిర్వహించారు. ఈ యాగం నందు 100 జంటలు పాల్గొన్నారు. శేఖర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన యాగములో ముఖ్య అతిథులుగా పంచ సిద్ధ లింగేశ్వర స్వామి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రావుల రవీంద్రనాథ్ రెడ్డి ,ధర్మకర్త అమ్మాల మహేశ్వర్, మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్, ఆలయ నిర్వాహకులు విశ్వనాథ్, ఆలయ గౌరవ అధ్యక్షులు మల్లికార్జున స్వామి, శ్రీ వాసవి సేవా సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఈ సి మెంబర్ గా టి.ఎస్. చక్రవర్తి

భానుపురి /ఖమ్మం



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి.డబ్ల్యూ.జే. ఎఫ్ ) రాష్ట్ర కమిటీలో ఖమ్మానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నాయకులు టి.ఎస్. చక్రవర్తికి కీలక బాధ్యతలు దక్కాయి. ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆమోదంతో ఆయనను రాష్ట్ర కమిటీ ఈసీ మెంబర్ గా నియమించారు. శనివారం ఖమ్మంలోని ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి సమక్షంలో నియామక ప్రకటన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం టి ఎస్ చక్రవర్తి ఎన్నో సంవత్సరాలుగా నిరంతర పోరాటం చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర కమిటీలో ఆయనకు చోటు దక్కడం ఖమ్మం జిల్లాకు గౌరవకారణమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం గతం నుంచి అలుపెరగని పోరాటం చేస్తున్న టి.ఎస్. చక్రవర్తి, జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ రాష్ట్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన ఎంపికపై జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# సద్దల చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భానుపురి /సూర్యాపేట టౌన్



సద్దల చెరువులో గుర్తుతెలియని పురుషుడు మృతదేహం లభించినట్లు పట్టణ సిఐ వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక విచారణలో, సదరు వ్యక్తి అనుకోకుండా ప్రమాదవశాత్తు సద్దల చెరువులో పడిపోవడం వల్ల మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, మృతునికి సుమారు 60-65 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. బ్ల్యూ కలర్ లుంగీ శరీరంపై ధరించిన ఉన్నాడని, మృతదేహానికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే సమీప పోలీస్ స్టేషనుకు లేదా 8712686005, 8712577224 ఫోన్ నంబర్లను సంప్రదించి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

# జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గా అనిత

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గా అనిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన లక్ష్మణ్ నాయక్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ పై వెళ్లగా జనగాం నుండి ఆమె సూర్యాపేట జిల్లాకు వచ్చింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.